సాక్షి శ్రీకాకుళం

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



పంట మునిగిపోవాల్సిందేనా?

కడపలవానిగెడ్డ సమస్యలు పరిష్కారం కావడం లేదు. రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు.

- 8లో



జీతాలు ఇవ్వండి మహాప్రభో

వీఓఏలకు ఐదు నెలలుగా జీతాలు లేవు. జీతాలు చెల్లించాలని కోరుతున్నారు.

- 8లో

జిల్లాకు కొత్తగా 31 బస్సులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లాకు కొత్తగా 31 ఆర్టీసీ బస్సులు రానున్నాయని జిల్లా ప్రజారవాణా అధికారి ఎ.విజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ కార్యాలయంలో విజయ్‌కుమార్ మాట్లాడారు. ఇప్పటికే జిల్లాకు 6 కొత్త బస్సులు వచ్చాయని, మరో రెండు రోజుల్లో శ్రీకాకుళం ఒకటో డిపోకు ఒక అల్ట్రా డీలక్స్ బస్సు, మరొక అల్ట్రా పల్లెవెలుగు బస్సు, ఒక సూపర్ లగ్జరీ బస్సు కలిపి మొత్తం 3 బస్సులు రానున్నాయన్నారు. అదేవిధంగా మరో రెండు, మూడు నెలల్లో ఏపీఎస్ ఆర్టీసీకి సంబంధించి మరో 12 బస్సులు రానున్నాయని తెలిపారు.

న్యూస్‌రీల్

'బాలబాలికలిద్దరూ సమానమే'



మాట్లాడుతున్న ఆర్డీఓ రంగయ్య

శ్రీకాకుళం పాతబస్టాండ్: సమాజంలో ఆడ, మగ అనే లింగబేధం ఉండరాదని రెవెన్యూ డివిజినల్ అధికారి సీహెచ్ రంగయ్య అన్నారు. శ్రీకాకుళం ఆర్డీఓ చాంబర్‌లో లింగ నిష్పత్తి, లింగ నిర్ధారణ చట్టం అమలుపై సోమవారం సబ్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో సీసీ కెమెరాల పనితీరు పర్యవేక్షించాలన్నారు. చట్టంపై అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. స్కానింగ్ కేంద్రాలపై నిఘా పెట్టాలని సూచించారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ



చీపి ఆశ్రమ పాఠశాల తనిఖీలో ఐటీడీఏ పీఓ రాహుల్‌కుమార్ రెడ్డి

కాశీబుగ్గ: మందస మండలంలోని చీపి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి టి.రాహుల్ కుమార్ రెడ్డి సోమవారం తనిఖీ చేశారు. 160 మంది ఉండాల్సిన ఆశ్రమ పాఠశాలలో 82 మంది విద్యార్థులు మాత్రమే ఉండడానికి కారణాలు ఏంటని అడిగారు. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం వసతి గృహాన్ని తనిఖీ చేశారు. అనంతరం చీపి గ్రామంలో గ్రీవెన్స్‌సెల్ నిర్వహించి పలు సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించారు. కార్యక్రమంలో డీడీ అప్పన్నదొర, మందస ఎంపీడీఓ ఏ రఘుపతిరావు, ఏటీడబ్ల్యూఓ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ స్వాతంత్య్ర వేడుకలకు రైతు దంపతులకు ఆహ్వానం



ఆహ్వానం అందుకున్న దోమ మోహనరావు, పుణ్యావతి దంపతులు

కోటబొమ్మాళి: ఢిల్లీలోని ఎర్రకోటలో జరగనున్న 78వ స్వాతంత్య్ర వేడుకలకు హాజరుకావాలని నిమ్మాడ గ్రామానికి చెందిన రైతులు దోమ మోహనరావు, పుణ్యావతి దంపతులకు కేంద్ర వ్యవసాయ శాఖ నుంచి సోమవారం ఆహ్వానం అందింది. వ్యవసాయ రంగంలో ఉత్తమ రైతు కుటుంబంగా పీఎం కిసాన్ పథకం ద్వారా వీరిని కేంద్ర వ్యవసాయ శాఖ ఎంపిక చేసినట్లు కోటబొమ్మాళి ఏఓ ఎస్.గోవిందరావు సోమవారం తెలిపారు.

పంద్రాగస్టు వేడుకల ఏర్పాట్ల పరిశీలన



మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్, జేసీ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: స్వాతంత్య్ర వేడుకలను ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానంలో జరిగే 78వ స్వాతంత్య్ర వేడుకల ఏర్పాట్లను సోమవారం వివిధ శాఖల అధికారులతో కలిపి ఆయన పరిశీలించారు. పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మైదానం అంతా పరిశుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఎస్పీ శేషాద్రి నాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారులు సీహెచ్ రంగయ్య, నగరపాలక సంస్థ కమిషనర్ ఓబులేసు ఉన్నారు.

మేఘ ఛత్రం



పగలే చీకటయ్యేలా.. సోమవారం కారు మబ్బులు జిల్లా కేంద్రాన్ని కమ్ముకున్నాయి. నగరానికి నల్లటి గొడుగు పట్టినట్లు ఆవరించిన మేఘాలు కాసిన్ని చినుకులు మాత్రమే చిలకరించి వెళ్లిపోయాయి. మేఘావృతమైన దృశ్యాలు మాత్రం ఆకట్టుకున్నాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

అనుమతి లేకుండా..


- యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ తరలింపు
- హైవేపైనే ఆ వాహనాలు వెళ్తున్నా పట్టించుకోని వైనం
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

ఎచ్చెర్ల క్యాంపస్/రణస్థలం:

అనుమతులు తీసుకోలేదు.. హద్దులు చూసుకోలేదు.. నిబంధనలు పాటించలేదు. కానీ కొండలు మాత్రం కరిగిపోతున్నాయి. హైవేపై నుంచే ఆ బళ్లు రయ్‌రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. కానీ అధికారుల కళ్లు తెరచుకోవడం లేదు. ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు మండలాల్లో యథేచ్ఛగా కొండ గ్రావెల్‌ను తరలించేస్తున్నారు. కొండ కనిపించడమే ఆలస్యం పొక్లెయిన్లు పెట్టి తవ్వుకుపోతున్నారు. వాస్తవానికి ఈ గ్రావెల్ తరలించాలంటే కాల పరిమితితో కూడిన అనుమతులు మైన్స్, రెవెన్యూ శాఖలు ఇవ్వాలి. హద్దులు నిర్ణయించిన ప్రాంతంలోనే మైనింగ్ నిర్వహించాలి. పక్కాగా నిబంధనలు పాటించాలి. కానీ అవేవీ లేకుండానే టిప్పర్లు, ట్రాక్టర్లు, లారీలతో తరలిస్తున్నారు. జిల్లాలో పలు ప్రాంతాలకు ఈ గ్రావెల్ తరలిపోతోంది. డిమాండ్ బట్టి లారీ రూ. 6 వేల నుంచి రూ. 10వేల వరకు లాగేస్తున్నారు.

పట్టించుకునే వారేలేరు..

ఎచ్చెర్ల నియోజకవర్గంలో ప్రధానంగా సూర్యనారాయణపురం, సంచాం, చిలకపాలెం, నారాయణపురం, అక్కయ్యపాలెం, తామాడ కొండల నుంచి ఈ అక్రమ రవాణా కొనసాగుతోంది. ఎక్కడా భూగర్భ గనుల శాఖ, రెవెన్యూ శాఖ అనుమతులు లేవు. ప్రస్తుతం ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. స్థానికులు ఫిర్యాదు చేస్తున్నా అధికారుల నుంచి స్పందన కనిపించడం లేదు. మరో పక్క గ్రామీణ ప్రాంతాల్లో ఈ టిప్పర్లు, లారీలు తిరగడం వల్ల రోడ్లు సైతం పాడవుతున్నాయి. కొండల్లో నచ్చినట్లు పొక్లెయినర్లతో తవ్వేస్తున్నారు. దీని వల్ల భవిష్యత్‌లో ప్రకృతి విపత్తులు సంభవించవచ్చు. పక్కన ఉన్న జిరాయితీ భూములు సైతం కోతకు గురికావచ్చు. ఎచ్చెర్లలోని నారాయణపురం భూముల్లో అక్రమ క్వారీయింగ్ సాగుతోంది. ఇక్కడ జిరాయితీ భూముల్లో అక్రమ క్వారీయింగ్ నిర్వహిస్తున్నారు. జిరాయితీ భూములకు సైతం అనుమతులు తీసుకోవాల్సి ఉన్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు.



ప్రభుత్వ మారాక..

కూటమి ప్రభుత్వం ప్రభుత్వం వచ్చాక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. మండల, గ్రామ స్థాయి నాయకుల కనుసన్నల్లో వ్యాపారం సాగుతోంది. అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఫిర్యాదులు వస్తే వాహనాలకు నామమాత్రపు అపరాధ రుసుం వేసి విడిచిపెడుతున్నారు. లేదంటే పట్టించుకోవటం లేదు. వాస్తవంగా అక్రమ మైనింగ్‌పై వాహనాలు సీజ్ చేయాలి. అక్రమంగా రవాణా చేసున్న వారికిపై క్రిమినల్ కేసులు పెట్టాలి. కనీసం పట్టించుకునే వారు లేని పరిస్థితి ఉంది. సాక్షాత్తు హైవేపై నుంచే ఈ బళ్లు వెళ్తున్నా మైన్స్, రెవెన్యూ, పోలీస్ మూడు వ్యవస్థలు సైతం పట్టించు కోవటం లేదు. పట్టుకున్నా నాయకుల నుంచి వచ్చిన ఒత్తిడికి విడిచి పెడుతున్నారు. అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టకపోతే అక్రమ రవాణా ఆగదు.

> **అడ్డుకుంటాం..**
>
> కొండ గ్రావెల్ తరలింపునకు అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. అనుమతులు లేకుండా తరలింపు నేరం. అక్రమంగా మైనింగ్ నిర్వహిస్తున్న కొండలు పరిశీలిస్తాం. అక్రమ మైనింగ్ అడ్డుకుంటాం.
>
> – మాణిక్యాలరావు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్, మైన్స్ విభాగం



సంచాం కొండ పరిస్థితి



చిలకపాలెం నుంచి అక్రమ గ్రావెల్ కోసం ఉపయోగిస్తున్న యంత్రాలు

మీకోసం @ 259

- కలెక్టర్ గ్రీవెన్స్‌కు వెల్లువెత్తిన ఫిర్యాదులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: మీకోసంలో అందిన అర్జీలకు సత్వర పరిష్కారాన్ని అందించాలని, అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని సంబంధిత అధికారులను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులకు హెచ్చరించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, జిల్లా రెవెన్యూ అధికారి అప్పారావు, డీఆర్‌డీఏ పీడీ కిరణ్, జిల్లా పరిషత్ సీఈఓ వెంకటేశ్వరరావు అర్జీదారుల నుంచి విజ్ఞప్తులు స్వీకరించారు. ఈ వారం మొత్తం 259 అర్జీలు స్వీకరించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన (నా ఇంటిపై జెండా ఎగురవేస్తాను) సంతకాల సేకరణ కార్యక్రమంలో అధికారులు సంతకాలు చేశారు.

ఎచ్చెర్లలో చెరువును పరిరక్షించండి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం : ఎచ్చెర్ల గ్రామంలో సర్వే నంబర్ 12–1లో ఉన్న చెరువును ఆక్రమించి, మొక్కలు వేస్తున్నారని ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సంధ్య గజపతి రావు, కిల్లాన గంగరాజు, కూన రమణారావు తదితరులు కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. గతంలో ఈ చెరువు ఆక్రమణకు గురైందని, అప్పటి జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన మల్లారపు నవీన్ కూడా ఆక్రమణను గుర్తించి, రికార్డుల్లో చౌదరి నారాయణమూర్తి పేరును తొలగించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే తర్వాత చౌదరి నారాయణమూర్తి వాస్తవాలు కప్పి పుచ్చి, కోర్టును తప్పుదోవ పట్టించి మధ్యంతర ఉత్తర్వులు తెచ్చుకుని చెరువుల్లో మొక్కలు వేసుకుంటున్నారని ఫిర్యాదులో ప్రస్తావించారు. ఎస్‌ఎల్‌ఆర్ లోనూ, 2011–12 అడంగల్‌లోనూ, 1959 ప్రొసీడింగ్ ఆఫ్ ది అసిస్టెంట్ సెటిల్‌మెంట్ ఆఫీస్‌లో కూడా చెరువుగానే పేర్కొని ఉందని, కానీ అధికారులు, ప్రభుత్వ న్యాయవాది సరైన ఆధారాలతో కౌంటర్ వేయకపోవడం వల్ల మధ్యంతర ఉత్తర్వులు వచ్చాయని జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు వివరించారు.



మీ కోసంలో ఫిర్యాదు చేస్తున్న ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు

'తక్షణం సాగునీరు ఇవ్వాలి'



'మీకోసం' వద్దకు వచ్చిన చింతాడ రవికుమార్, రైతులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నారాయణపురం ఆనకట్ట కుడి కాలువ కింద సంతకవిటి, పొందూరు, ఎచ్చెర్ల మండలాల్లో సుమారు 25 వేల ఎకరాల ఆయకట్టు పరిధిలోని పొలాలకు సాగునీరు అందించాలని, వైఎస్సార్ సీపీ ప్రచార విభాగం జోనల్ ఇన్‌చార్జి చింతాడ రవి కుమార్ 'మీ కోసం' కార్యక్రమంలో కలెక్టర్‌ను కోరారు. ఆయనతో పాటు ఆయా మండలాల రైతులు, ప్రజా ప్రతినిధులు ఉన్నారు. ఏటా జూలైలోనే నీరు వచ్చేదని, నాట్లు అయిపోయేవని, ఈ ఏడాది మరమ్మతుల పేరుతో నీరు విడుదల చేయలేదన్నారు. కలెక్టర్ వెంటనే దీనిపై ఇరిగేషన్ ఇంజినీర్‌ను పిలిపించి నాసిరకంగా పనులు జరుగుతున్న కారణంగా తక్షణమే నిధులు నిలుపుదల చేయాలని ఆదేశించారు. అలాగే ఈ ఖరీఫ్‌కు వెంటనే నీటిని విడుదల చేయాలని, కాలువ శివారు ప్రాంతాల వరకు సాగునీరు అందించాలని తెలిపారు.

ఉద్యోగాల పేరిట టోకరా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలోని స్టేట్‌బ్యాంకు రీజియన్ పరిధిలో ఉన్న పలు బ్రాంచిల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి నగరంలోని అరసవల్లి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన గొల్ల బెనర్జీ అలియాస్ హర్ష రూ. 1.80 కోట్ల వరకు మోసం చేశాడని పలువురు నిరుద్యోగులు సోమవారం ఎస్పీ గ్రీవెన్స్‌లో మొరపెట్టుకున్నారు. విషయంలోకి వెళ్తే.. జిల్లా కేంద్రం సమీపంలోని కొమరవానిపేట, ఒప్పంగి, వాడాడ, అరసవల్లికి చెందిన నిరుద్యోగ యువత బర్రె ఆదినారాయణ, గొండు అప్పన్న, కొండపల్లి బాబూరావు, బరాటం అప్పన్నలే కాక మరో పది మంది యువతకు అరసవల్లికి చెందిన గొల్ల బెనర్జీ 2022లో స్నేహితుల ద్వారా పరిచయమయ్యాడు. ఎస్‌బీఐలో ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పడంతో ఆయన భార్య ఖాతాలోకి అంతా డబ్బులు వేశారు. రెండేళ్లవుతున్నా జాబ్‌లు ఇప్పించకపోవడంతో పాటు మొహం కూడా చాటేశాడని, ఫోన్లు చేస్తున్నా స్పందించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. గొల్ల బెనర్జీ మా వద్ద తీసుకున్న డబ్బులు ఇప్పించి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి



వృద్ధుని గోడు వింటున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి చొరవ చూపాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎస్పీ అర్జీదారుల నుంచి 50 వినతులు స్వీకరించారు. విజయనగరం జాయింట్ కమిషనర్ (జేసీ) బు దుమూరు నాగార్జున రావు తనపై కక్ష కట్టారని, అక్రమాలు బయట పెట్టాననే అక్కసుతో మానసికంగా వేధిస్తున్నారని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షురాలు అలికాన రాజేశ్వరి ఎస్పీ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇది సర్దుపోటు

- ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియపై సంఘాల మండిపాటు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర విద్యాశాఖ తాజాగా విడుదల చేసిన ఉపాధ్యాయ పని సర్దుబాటు ప్రక్రియంతా గందరగోళంగా, లోపభూయిష్టంగా ఉందని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు పిసిని వసంత రావు, కూన రంగనాయకులు అన్నారు. ఈ మేరకు విద్యాశాఖ పని సర్దుబాటుకు సంబంధించిన లోపాలు, నివారణ చర్యలు తీసుకోవాలని కోరుతూ డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమలచైతన్యను సమగ్రశిక్ష ప్రాజెక్ట్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. మూడు నుంచి 10వ తరగతి వరకు ఒక్క తెలుగు భాషోపాధ్యాయుడినే నియమించడం ఎంతవరకు సమంజసమని అన్నారు. అన్ని మేనేజ్‌మెంట్లలో ఉపాధ్యాయుల సర్దుబాటు చేసే ముందే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

'బడులు మూసివేసే ప్రక్రియా?'

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వం ఉపాధ్యాయుల సర్దుబాటు పేరిట చేస్తున్న కసరత్తును నిశితంగా పరిశీలిస్తే ఇది పాఠశాలలను మూసివేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్టుగా ఉందని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మజ్జి మదన్మోహన్, ఎస్‌వీ అనిల్ కుమార్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటనలో ప్రభుత్వం, విద్యాశాఖ అనుసరిస్తున్న తీరును ఎండగట్టారు. రిటైర్‌మెంట్లతో టీచర్ల కొరత ఏర్పడిందని, వీటిని భర్తీ చేయాల్సి ఉందని, డీఎస్సీ నియామకాలు కూడా జరపాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ 117 జీఓను రద్దు చేయకుండా, ఈ ప్రభుత్వం కూడా అదే జీఓ ప్రాతిపదికగానే.. మొత్తం సర్దుబాటు ప్రక్రియ చేపడుతోందని మండిపడ్డారు.



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘు జిల్లాశాఖ ప్రతినిధులు

'సర్దుబాట్లను వెంటనే ఆపండి'

అసంబద్ధంగా జరుగుతున్న ఉపాధ్యాయ సర్దుబాటును పూర్తిగా ఫోర్టో వ్యతిరేకిస్తోందని ఆ ఉపాధ్యాయ సంఘం చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రటరీ జనరల్ అంకాల కొండయ్య, ముఖ్య సలహాదారులు గాండ్లపర్తి శివానంద రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం అత్యవసరంగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కాల్‌లో ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం విద్యాశాఖ చేపడుతున్న ఉపాధ్యాయ సర్దుబాట్లకు శాస్త్రీయత లేదని తెలిపారు. 117 జీఓ రద్దు తర్వాతనే సర్దుబాటు జరపాలని వారంతా కోరారు. అన్ని ఉపాధ్యాయ సంఘాలతో సమన్వయ సమావేశాన్ని నేరుగా విద్యాశాఖ మంత్రి ఏర్పాటు చేయాలని కోరారు.

'రాజకీయ వేధింపులు ఆపండి'



సమస్యలను వివరిస్తున్న ఎండీయూ ఆపరేటర్లు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రేషన్ బియ్యంను లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి అందజేసే వాహనాల ఆపరేటర్లపై రాజకీయ వేధింపులు ఆపాలని, వాహనాల ద్వారా బియ్యం సరఫరా కొనసాగించాలని ఎండీయూ ఆపరేటర్ల సంఘం గౌరవాధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ కోరారు. ఎండీయూ ఆపరేటర్లతో కలిసి సోమవారం మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో విలేకరులతో మాట్లాడారు. రేషన్‌కార్డుదారుల కష్టాల నుంచి విముక్తి కలిగించి వారి ఇంటి వద్దకే వెళ్లి బియ్యం అందజేసే గొప్ప కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. ఎలక్షన్ సమయంలో ఎండీయూ ఆపరేటర్లు కోడ్ ఉల్లంఘన చేశారన్న నెపంతో కొంతమందిని విధుల నుంచి సస్పెండ్ చేశారని, సస్పెన్షన్లు ఎత్తివేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. కొన్ని చోట్ల రాజకీయ వేధింపులకు పాల్పడుతున్నారని, పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితి దారుణంగా ఉందని అన్నారు. వాహనాలు కొనసాగించి ప్రజలకు అందుబాటులో రేషన్‌ను ఉంచాలని కోరారు.

క్లుప్తంగా

చిలకపాలెం గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెం గ్రామ కార్యదర్శి ఎం.అప్పలరాజును సస్పెండ్ చేస్తూ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలయానికి మెయిల్‌లో ఉత్తర్వులు పంపించారు. ఈ నెల 9వ తేదీన కలెక్టర్ జి.సిగడాం మెట్టవలస వెళ్లి తిరిగి వెళ్లి వస్తూ చిలకపాలెం కూడలిలో కారు ఆపి పారిశుద్ధ్య పరిస్థితులు పరిశీలించారు. పరిస్థితులు అధ్వానంగా ఉండడంతో స్థానిక అధికారులను ప్రశ్నించారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసి గ్రామ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ దేవికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

'ఎస్సీ కుల విభజన రాజ్యాంగ విరుద్ధం'



విలేకరులతో మాట్లాడుతున్న ఏపీ దళిత మహాసభ నాయకులు బెంజిమెన్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎస్సీ కుల విభజన రాజ్యాంగ విరుద్ధమని ఏపీ దళిత మహాసభ నాయకులు పి.బెంజిమెన్ తెలిపారు. సోమవారం జిల్లా పరిషత్‌లోని మీకోసం కార్యక్రమం వద్ద ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటులో చర్చలేకుండా, రాజ్యాంగ సవరణ చేయకుండా విభజన చేయడం సరికాదని, దీనిపై ఈనెల 17న ఉద్యమం చేపట్టనున్నామని అన్నారు. ఆదివారం పేట నుంచి నిరసన కార్యక్రమం చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో కె.రాజులు, లింగమూర్తి, అసిరి నాయుడు తదితరులు ఉన్నారు.

'ప్రేమ పేరుతో వంచించాడు'

శ్రీకాకుళం క్రైమ్ : సోంపేట మండలం శారదాపురం గ్రామానికి చెందిన నారవ వివేక్ తనను ప్రేమ పేరుతో వంచించాడని నగరానికి చెందిన యువతి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ సీహెచ్ పైడపునాయుడు తెలిపిన వివరాల మేరకు గైనేటి వీధికి చెందిన పీతల రమ్య(33)కు వివేక్ టెక్కలిలోని ఐతమ్ కాలేజీలో (బీటెక్) ఇంజినీరింగ్ చేసేటప్పుడు పరిచయమయ్యాడు. గత ఎనిమిదేళ్లుగా ప్రేమించుకుంటున్నామని, పెళ్లి కూడా చేసు కుంటానని నమ్మించాడని, సుమారు రూ. 3 లక్షల వరకు సొమ్మును కూడా తీసుకున్నట్లు యువతి ఫిర్యాదులో పేర్కొంది. వివేక్‌కు విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కందివలస గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడంతో మొహం చాటేశాడు. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఒక టో పట్టణ పీఎస్‌ను యువతి ఆశ్రయించగా వివేక్‌ను పోలీసులు పిలిపించారు. పెద్దలు, పోలీసుల సమక్షంలో రెండు నెలలు సమయం కావాలని, పెళ్లి చేసుకుంటానని బాండ్ పేపర్ మీద వివేక్ రాసిచ్చా డు. తీరా సమయం పూర్తయినా స్పందించకపోవడం, పెళ్లి కూడా చేసుకోనని స్టేషన్‌కు వచ్చి చెప్పడంతో సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ కామేశ్వరరావు కౌన్సిలింగ్ చేశారు. అయినప్పటికీ ఒప్పుకోకపోవడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కామేశ్వరరావు చెప్పారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఎచ్చెర్ల క్యాంపస్: నాగావళి నది నుంచి తమ్మినాయుడుపేట గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను ఎచ్చెర్ల ఎస్‌ఐ ఎస్.చిరంజీవి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. అనంతరం స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి సీజ్ చేశారు.

తురకపేట-దబ్బపాడు వద్ద పంటను ముంచేస్తున్న కడపలవానిగెడ్డ వరదనీరు



పంట మునిగిపోవాల్సిందేనా..?

- ఆందోళనలో కడపలవానిగెడ్డ ఆయకట్టు రైతులు
- గెడ్డకు శాశ్వత మరమ్మతుల కోసం నిరీక్షణ
- వరద వస్తే 15 రెవెన్యూ గ్రామాల్లో పంటల నష్టం

ఎల్‌ఎన్ పేట: ఏటా అక్కడ ముంపు ముప్పు తప్పడం లేదు. ఈ ఏడాది కూడా అదే జరిగితే నష్టం భరించలేమని రైతులంటున్నారు. ఏటా రైతుల్లో ఎంతో వేదనను మిగుల్చుతున్న కడపలవానిగెడ్డ కథకు ఇకనైనా ముగింపు పలకాలని కోరుతున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలోని తురకపేట-దబ్బపాడు గ్రామాల మధ్య తురకపేటకు సమీపంలో కడపలవానిగెడ్డ ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షం నీరు కడపలవానిగెడ్డ నుంచి మూడు కిలోమీటర్ల దూరం ప్రవహిస్తూ వెళ్లి దిగువన ఉన్న వంశధార నదిలో కలుస్తుంది. కొద్దిపాటి వర్షం కురిసినా వచ్చే వరదనీరు కారణంగా 3వేల ఎకరాల పంట భూములు వరదనీటిలో మునిగి పోతున్నాయి. పది నుంచి పదిహేను రోజుల వరకు వరదనీరు పొలాల్లోనే ఉంటుంది. వరద వచ్చిందంటే రైతులు పంటలతో పాటు పెట్టుబడులు కూడా జల సమాధి అవుతున్నాయి. రైతులకు అప్పులు, వడ్డీలే మిగిలి



ఇటీవలి కురిసిన వర్షాలకు కడపలగెడ్డ వద్ద రోడ్డుపై నుంచి ప్రవహించిన వరద నీరు

పోతున్నాయి.

ముంపుబారిన పడుతున్న గ్రామాలు

కడపలవానిగెడ్డకు ఏటా వస్తున్న వరదల కారణంగా తురకపేట, దబ్బపాడు, సుమంతాపురం, సిద్ధాంతం, సీతారాంపురం, వాడవలస, మిరియాపల్లి, ధనుకువాడ, కోవిలాం, చిట్టిమండలం, సోమనాథపురం, బరటాం, కృష్ణాపురం తదితర గ్రామాలకు చెందిన మూడు వేల ఎకరాలకు ముంపు బారిన పడుతున్నాయి. గట్టిగా ఒక జల్లు వర్షం కురిస్తే వంశధార నదీ తీరంలో ఉన్న దబ్బపాడు గ్రామస్తులు తురకపేట నుంచి గెడ్డ దాటి రాలేని దుస్థితి నెలకొంటుంది. తురకపేట వద్ద ఉన్న కడపలవానిగెడ్డపై సుమారు నాలుగు నుంచి ఆరేడు అడుగుల వరదనీరు రోడ్డు మీదనుంచే ప్రవహిస్తుంది. దీనిపై చాలా మంది హామీలు ఇచ్చినా పనులు జరగలేదు. 2015 అక్టోబర్‌లో హుద్‌హుద్ తుఫాన్ వర్షాల కారణంగా రైతులకు అపార నష్టం జరిగింది. అప్పట్లో ప్రజా ప్రతినిధులు వచ్చి చూసినా ఆపైన పనులేవీ చేయలేదు.

ముంపులోనే పంటలు



ఏటా పంటలు కడపలగెడ్డ వరద ముంపులోనే ఉంటాయి. జూన్, జూలై నెలల్లో కురిసే వర్షాలకు ఖరీఫ్ పనులు ప్రారంభిస్తాం. విత్తనాలు వేసుకోవడంతో పాటు కలుపు నివారణ చేయడం ఎరువులు వేసుకునేంత వరకు బాగానే ఉంటుంది. ఆగస్టు నెల నుంచి వచ్చిన వరదలకు పంట పొలాలు నీట మునిగిపోతాయి. పంట చేతికి అందివచ్చే సమయంలో అక్టోబర్, నవంబర్ నెలల్లో కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా ముంపులో ఉంటాయి. చేను కుళ్లిపోయి ఎందుకూ పనికిరాకుండా పోతుంది. ఏటా ఇదే దుస్థితి ఉంటుంది.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు

విపత్తులు గుర్తించటం, సహాయక చర్యలే కీలకం

ఎచ్చెర్ల క్యాంపస్: విపత్తులు గుర్తించటం, సహాయ చర్యలు చేపట్టడం రెండు అంశాలూ కీలకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఆర్ రజిని అన్నారు. వర్సిటీ సెమినార్ హాల్‌లో సోమవారం రీసెర్చ్ ఫోరం నిర్వహించిన విపత్తులు–పరిశోధన అంశంపై సదస్సులో ఆమె మాట్లాడారు. వయనాడ్ వంటి సంఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని, భవిష్యత్‌లో విపత్తులు గుర్తించటం కీలకమని చెప్పారు. విపత్తులు ముందుగా గుర్తిస్తేనే ప్రాణ నష్టం నుంచి బయటపడవచ్చని తెలిపారు. విపత్తుల అనంతరం సాధారణ పరిస్థితులు నెలకొల్పడం అవసరమన్నారు. థాంప్సన్ రివర్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్



మాట్లాడుతున్న వీసీ రజిని

సోషల్ వర్క్ (కెనడా) ప్రొఫెసర్ బాల నిక్కు మాట్లాడుతూ విపత్తులు అనంతరం పరిస్థితులు చక్కబెట్టడం కూడా కీలకమన్నారు. టెక్నాలజీ విస్తరిస్తున్నా, ఇంకా ప్రకృతి విపత్తుల కారణంగా ప్రాణ నష్టం, ఆస్తినష్టం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రెక్టార్ అడ్డయ్య, రిజిస్ట్రార్ సుజాత పాల్గొన్నారు.

హమ్మయ్య.. బాలుడు దొరికాడు

- బాలుడిని కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నం
- పోలీసుల అదుపులో నలుగురు యువకులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆదివారం అదృశ్యమైన కిల్లంశెట్టి విశ్వజిత్ అనే పదేళ్ల బాలుడు తల్లిదండ్రుల చెంతకు చేరాడు. వివరాల్లోకి వెళ్తే.. ఆదివారం సెలవు దినం కావడంతో బాలుడు కాశీబుగ్గలోని మంకినమ్మ క్రీడా మైదానానికి వెళ్లాడు. మిత్రులతో కలిసి ఆడుకుంటున్న బాలుడు ఒక్కసారిగా అదృశ్యమైపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చెందారు. ఒక్కసారిగా బృందాలుగా ఏర్పడి జంట పట్టణాలను జల్లెడ పట్టారు. క్రీడామైదానానికి అనుసంధానమైన ఓ రోడ్డులో నలుగురు యువకులు బాలుడిని రాత్రి పదకొండు గంటలకు తరలిస్తుండగా స్థానికులు చూశారు. బాలుడు నిలబడలేక పడిపోతున్న పరిస్థితి చూసి వారిని ప్రశ్నించారు. ఆ నలుగురు యువకులు తెలివిగా బాలుడు అదృశ్యమయ్యారని తెలుసుకుని వారికి అప్పగిస్తామని చెప్పి అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. ఇంతలో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు వచ్చి బాలుడి పరిస్థితి



ఇంటికి చేరిన బాలుడు విశ్వజిత్

గమనించగా మత్తుమందు ఇచ్చినట్లు గుర్తించారు. అప్పటికే తండ్రి కిల్లంశెట్టి రాజేంద్రప్రసాద్, కుటుంబ సభ్యులు బాలుడిని ఇంటికి తరలించి సపర్యలు చేశారు. నలుగురు వ్యక్తులు పిలిచి మత్తు మందు ఇచ్చారని బాలుడు తేరుకుని చెప్పడంతో కాశీబుగ్గ పోలీసులకు ఆశ్రయించారు. ఈ సందర్భంగా బాలుడి నుంచి సమాచారం అందుకున్న పోలీసులు నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. కిడ్నాప్ చేసి తల్లిదండ్రుల నుంచి డబ్బు కాజేయడానికి ప్లాన్ వేసి విఫలమయ్యారని తెలిపారు. పోలీసుల పూర్తి విచారణ అనంతరం తలిదండ్రులు, పోలీసులు మంగళవారం ఉదయం మీడియాకు వివరాలు వెల్లడించనున్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

టెక్కలి రూరల్: నౌపడ రైల్వేస్టేషన్ సమీపంలో సోమవారం ఒక వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడిని విజయనగరం జిల్లా చీపురుపల్లి గ్రామం కస్పా వీధికి చెందిన మోనంగి మోహనరావు(56)గా రైల్వే పోలీసులు గుర్తించారు. ఈ వ్యక్తి వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడని, నిత్యం తన గ్రా మం నుంచి విశాఖ వైపు వెళ్తూ ఉంటాడని ఏం జరిగిందో ఏమో తెలియదు గానీ సోమవారం నౌపడ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని రైలు కింద తలపెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు జీఆర్‌పీ ఎస్‌ఐ ఎస్‌కే షరీఫ్ వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వంట ఏజెన్సీ మహిళల తొలగింపుపై ఫిర్యాదు

కోటబొమ్మాళి: కమలనాభపురం ప్రాథమిక పాఠశాలలో ఎన్నో ఏళ్లుగా వంట ఏజెన్సీ మహి ళలుగా, అలాగే పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న తమను తొలగించారని పాల చిట్టెమ్మ, కూన మాణిక్యం తహసీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపీడీఓ వై.పద్మజకు సోమవారం ఫిర్యాదు చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మామిడి ఆనందరావు తమను విధుల నుంచి తొలగించి టీడీపీ వర్గీయులను తమ స్థానంలో నియమించారని తెలిపారు. సర్పంచ్, పాఠశాల కమిటీ చైర్మన్ ఆమోదం లేకుండా స్థానిక టీడీపీ నాయకుల ఒత్తిళ్లతో హెచ్‌ఎం ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని, తగు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని కోరారు.

అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో మనోళ్ల హవా



పతకాలు సాధించిన శ్రీకాకుళం క్రీడాకారులతో నక్క లక్ష్మణ్, యశ్వంత్, దుర్గాదాస్

శ్రీకాకుళం న్యూకాలనీ:

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇంటర్నేషనల్ స్టేడియంలో ఈనెల 10 నుంచి 12 వరకు జరిగిన అంతర్జాతీయ స్థాయి మార్ష్ ఆర్ట్స్ పోటీల్లో శ్రీకాకుళానికి చెందిన క్రీడాకారులు హవా కనబరిచారు. ఈ పోటీల్లో బి.కార్తికేయ బంగారు పతకం, పి.గౌరవ్, సందీప్, జైచరణ్‌లు కాంస్య పతకాలు సాధించి శభాష్ అనిపించారు. వీరంతా శ్రీకాకుళంలోని ఢిల్లీ ఇంటర్నేషనల్ స్కూల్‌లో చదువుతున్నారు. వీరికి సీనియర్ కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు ఉన్నతంగా తర్ఫీదు అందిస్తున్నారు. వీరి రాణింపుపై పాఠశాల అకడమిక్ డైరెక్టర్ ఎం.సత్యప్రసాద్, ప్రిన్సిపాల్ టి.అర్జున్ చక్రవర్తి సంతోషం వ్యక్తం చేశారు.

'ఆదివాసీల భూముల జోలికి వస్తే సహించబోము'

శ్రీకాకుళం పాత బస్టాండ్: కూర్మ గ్రామంలో స్వామీజీల భూములపై విచారణ చేయించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీలు తమ భూములు రక్షించాలని కోరుతూ సోమవారం ర్యాలీ నిర్వహించారు. జలుమూరు మండలం ఎస్టీ మాకివలస (డి) ఆదివాసీలకు అండగా జిల్లా వ్యాప్తంగా ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వైఎస్సార్ కూడలి నుంచి జిల్లా పరిషత్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాకివలస ఆదివాసీల భూమి కోసం ఎంత వరకైనా పోరాడుదామని తెలిపారు. తరతరాలుగా ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను ఊణ సత్యనారాయణ గుప్తా దౌర్జన్యంగా తీసుకున్నారని ఆరోపించారు. ఆదివాసీల సాగులో ఉన్న 25 ఎకరాల భూమిని కూర్మ గ్రామ స్వామీజీలకు 15 ఎకరాలు అమ్మివేశానని, 10 ఎకరాలు గిఫ్ట్ ఇచ్చానని వ్యాపారి చెబుతున్నారని, అయితే అతనికి ఆ భూమి ఎలా వచ్చిందో తెలపాలని డిమాండ్ చేశారు. అనంతరం



ర్యాలీ చేస్తున్న ఆదివాసీలు

మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కి వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో అఖిల భారత్ రైతుపల్లి సంఘం రాష్ట్ర నాయకులు వంకల మాధవరావు, జమ్మయ్య, భాస్కర్, సవర వెంకటేష్, ఎస్టీ మాకివలస గ్రామం పెద్దలు ఉత్తరయ్య, పాపారావు, ప్రసాద్, భాగ్య, ఆదెమ్మ, సూరపు నాయుడు, కల్యాణి, హరీష్, మహిళలు పాల్గొన్నారు.

'కులగణన శాస్త్రీయంగా జరగాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: అశాస్త్రీయంగా చేపట్టిన కులగణన కారణంగా రెల్లి కులస్తులు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని, శాస్త్రీయంగా కులగణన జరగాలని జాతీయ రెల్లి, గ్రూప్ కులాల సంక్షేమ సంఘం ప్రతినిధుల జాతీయ ప్రధాన కార్యదర్శి పి.సుధాకర్, పట్టణ కార్యదర్శి అర్జి ఈశ్వరరావు, జిల్లా అధ్యక్షులు గొల్లపిల్లి మోహనరావులు డిమాండ్ చేశారు. ముందుగా పాతబస్టాండ్ నుంచి జిల్లా పరిషత్ వరకు శ్రీకాకుళం నగరంలోని రెల్లి సామాజికవర్గ 12 ఉపకులాలకు చెందిన ప్రజలు ర్యాలీ నిర్వహించారు. నగరంలోని జిల్లాపరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ ద్వారా ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రులకు వినతి పత్రం అందజేశారు. తమ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ అనివార్యమైతే ఎస్సీల్లోని 59 కులాల వారిని కులగణన చేసి తర్వాత ఎస్సీ 59 కులాల్లో అధిక సంఖ్యలో రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందిన రెండు ఒంటరి కులాలైన మాల,



నగరంలో ర్యాలీ చేస్తున్న రెల్లి కులస్తులు

మాదిగ కులాలను ఒక గ్రూపులో చేర్చాలని కలెక్టర్‌ను కోరారు. ర్యాలీలో జలగడుగుల శ్రీరామ, కల్యాణి వెంకటరావు, జె.గోవిందరావు, అరుగుల గణేష్, అర్జి జ్యోతికుమార్, నల్లపిల్లి కృష్ణ, జె.శ్రీనివాసరావు, కవ్వాడి రవి, ఆకుల అప్పారావు, ధనాల రమణ, అరుగుల నాగేశ్వరరావు, బైరిశెట్టి బుజ్జిరాజు, ఎన్ హరి, పొట్నూరు గోపి, పొట్నూరు గణేష, తుపాకుల రవి, నల్లపిల్లి కాంచనమ్మ, అరుగుల రాజులమ్మ, బంగారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

హెచ్‌వీపై అవగాహన కోసం 'మీకు తెలుసా..?'

శ్రీకాకుళం పాతబస్టాండ్: హెచ్ఐవీ, లైంగికంగా సంక్రమించే ఇతర అంటువ్యాధుల గురించి సమాచారాన్ని అందించేందుకు, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు రెండు నెలలపాటు నేకో (నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ) నేతృత్వంలో 'మీకు తెలుసా' పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌తో కలిసి ఆయన ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు నిర్వహిస్తున్నారని తెలిపారు. డీఎంహెచ్ఓ బి.మీనాక్షి మాట్లాడుతూ హెచ్ఐవీ సంక్రమణ, నివారణ పద్ధతులపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం ఒక్కో నినాదంతో 8 వారాల పాటు



మీకు తెలుసా కార్యక్రమంపై మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. హెచ్ఐవీ అనుమానం ఉన్నవారంతా సిగ్గు పడకుండా తప్పనిసరిగా రక్త పరీక్ష చేయించుకుని, ఒక వేళ హెచ్ఐవీ పాజిటివ్ అని బయటపడితే ఏఆర్‌టీ సెంటర్లలో పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా ఉచితంగా మందులు తీసుకుని హాయిగా బతకవచ్చని చెప్పారు.

మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యం

శ్రీకాకుళం న్యూకాలనీ:

మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని, యువతపై మాదక ద్రవ్యాల ప్రభావం పడకుండా పకడ్బందీగా జాగ్రత్తలు తీసుకుందామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ విద్యార్థులతో నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ, మొక్కలు నాటడం, అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల జీవితం నాశనమవుతుందని, సమాజంలో గుర్తింపు కోల్పోతారని కలెక్టర్ అన్నారు. ఎన్‌డీపీఎస్ యాక్టులో పేరు నమోదైతే సొసైటీలో ఉనికి కోల్పోతారని గుర్తుచేశారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ తదితరులు మాట్లాడుతూ హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటిపైన జాతీయ జెండా ఎగురువేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బాలుర కళాశాలల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శాంతిశ్రీ, డీవీఈఓ శివ్వాల తవిటినాయుడు, ఆర్ఐఓ దుర్గాప్రసాద్,



ప్రతిజ్ఞ చేస్తున్న ఇంటర్మీడియెట్ విద్యార్థులు

డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, ఎన్‌సీసీ కెప్టెన్ డాక్టర్ వై.పోలినాయుడు, అటవీశాఖ తరుపున నాగేంద్రరావు, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.శ్రీనివాసపాత్రో, వివిధ జూనియర్ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో

- ఐదు నెలలుగా వేతనాలు లేక అల్లాడిపోతున్న వీఓఏలు
- పనిభారం పెంచి జీతం మరిచిన వైనం
- బకాయిలపై పెదవి విప్పని అధికారులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సాధికారిత, స్వావలంబన కోసం నిరంతరం పనిచేసే క్షేత్ర స్థాయి సిబ్బందిపై కూటమి ప్రభుత్వం కన్నెర్ర చేస్తోంది. గత ఐదు నెలలుగా జీతాలు లేక వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే స్కీమ్ వర్కర్లు, చిరుద్యోగులకు రాజకీయ వేధింపులకు గురిచేస్తున్న కూటమి పాలకులు వీఓఏలు, ఆర్పీలను కూడా వేధిస్తున్నారు.

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ-వెలుగు సంస్థలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సంఘాలను ఆర్థికంగా తీర్చిదిద్దే గ్రామ స్థాయి ఉద్యోగులు సీఏఫ్ (వీఓఏ), పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) పరిధిలో వార్డుల్లో పనిచేస్తున్న ఆర్పీలకు ఐదు నెలలుగా గౌరవ వేతనం ఇవ్వడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలలు దాటినా క్షేత్రస్థాయి ఉద్యోగులు జీతాలు విడుదల చేయలేదు. దీంతో వీరికి అవస్థలు తప్పడం లేదు. రూ.3వేలు ఉన్న వీరి జీతాలను గత ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రూ.8వేలకు పెంచారు. మరో రూ.2వేలు గ్రామ సంఘం లాభాల నిధుల నుంచి తీసుకునేలా వెసులుబాటు కల్పించారు. ఐదేళ్ల పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా వీరికి వేతనాలు అందాయి. మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో వీరికి జీతాలు ఆగాయి. తర్వాత వచ్చిన కొత్త ప్రభుత్వం కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. జిల్లాలోని డీఆర్‌డీఏ పరిధిలో 1224 మంది సీఏఫ్‌లు (వీఓఏ)లు ఉన్నారు. మెప్మా పరిధిలో ఆర్పీలు 48 మంది ఉన్నారు. జీతాలు లేక వీరంతా అల్లాడిపోతున్నారు.

పని భారం పెంచినా..

గ్రామ సంఘాల నిర్వహణ, సమావేశాలు నిర్వహించడం, వారికి సూచనలు సలహాలు అందజేయడం, ప్రతి నెల రెండు పర్యాయాలు సంఘాలకు వివరాలతో బుక్‌కీపింగ్, సంఘాలకు బ్యాంకు రుణాలు(లింకేజీలు)అందజేయడం, స్త్రీనిధి రుణాలు అందజేయడం, ఎన్ఆర్‌హెచ్ఎం పాలసీ లో భాగంగా లైవ్‌లీహుడ్ కార్యక్రమాలు, స్వయం ఉపాధి కార్యక్రమాల అమలు, నిర్వహణ, పర్యవేక్షణ వంటివెన్నో వీరు చేస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమాలు, ఇతర కార్యక్రమాలకు జన సేకరణ, అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటివి వీరు నిర్వహిస్తున్నారు. ఇంతచేస్తున్నా జీతాల బకాయిలు ఇవ్వకపోవడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

'వెలుగు వీఓఏలకు జీతాలు విడుదల చేయాలి'



వినతి పత్రంను అందజేస్తున్న వీఓఏల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: వెలుగు వీఓఏలకు ఐదు నెలల బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని లేకుంటే పోరాటాలు చేపడతామని వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేశారు. వెలుగు వీఓఏల సంఘం జిల్లా సమావేశం శ్రీకాకుళంలోని సీఐటీయూ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ వీఓఏలకు 5 నెల ల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనేక గ్రామాలలో వీఓఏపై రాజకీయ వేధింపులు జరుగుతున్నాయని పేర్కొన్నారు. వీఓఏల మెడపై కత్తిలా ఉన్న మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లా పరిషత్ మీ కోసంలో డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు డి.జోగారావు, జి.యర్రయ్య, డి.పద్మావతి, బి.కనకలక్ష్మి, సీహెచ్ స్వాతి, జి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.